


### క్షమాపణ చెప్పాల్సిందే..

తెలంగాణ సాధించి పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అహంకారపూరితంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు. రేవంత్‌రెడ్డి మాటలను తెలంగాణ సమాజం పూర్తిగా ఖండిస్తోంది. ఏడాది పాలనలో తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. సీఎం స్థాయిలో హుందాగా ఉండాల్సింది పోయి ఇలా దిగజారి మాట్లాడడం దారుణం. అసమర్థ సీఎంగా పేరుతెచ్చుకున్న రేవంత్ రెడ్డి వెంటనే గద్దె దిగాలి. తెలంగాణ సమాజం యావత్తు గౌరవించే కేసీఆర్‌ను అవమాన పరిచినందుకు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పి తీరాల్సిందే. **- కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే**

### రేవంత్ మాటలు జుగుప్సాకరం



కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఆయన నీచమైన ఆలోచనలకు నిదర్శనం. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి హుందాగా వ్యవహరించాలి. కానీ.. దుర్మార్గమైన ఆలోచనలు, బూతు మాటలతో తన స్థాయిని దిగజార్చుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి అలా మాట్లాడడం జుగుప్సాకరం. పరిపాలన చేతకాక, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ ఇష్టానుసారంగా మాట్లాడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. తమ నాయకుడు కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ వెంటనే క్షమాపణలు చెప్పాలి. **- అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్**





### విచక్షణ కోల్పోయారు..

తెలంగాణ సాధకులు కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. పాలన చేతకాక, ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల అమలులో విఫలమై ఇష్టారీతిన మాట్లాడుతున్నడు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో అసహనానికి లోనవుతున్నడు. కేసీఆర్ అసెంబ్లీకి రావడంతో రేవంత్‌రెడ్డికి భయమేస్తున్నది. పాలన వైఫల్యాలపై కేసీఆర్ నిలదీస్తే జనంలో తలెత్తుకోలేమని అవమానించేలా మాట్లాడుతున్నరు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన కేసీఆర్ వంటి నాయకుడిపై రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. **- బాల్క సుమన్, బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు**



### పాలన చేతగాకే అనుచిత వ్యాఖ్యలు..

ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నడు. తన చేతగాని తనాన్ని గత ప్రభుత్వం పైకి నెట్టాలని చూస్తున్నడు. కేసీఆర్ దమ్మున్న నాయకుడు. పదేండ్ల పాలనలో ఏం చేసినా ప్రజల ఆదరించారు. ప్రజల మనసును గెలుచుకున్నారు. పాలనలో విఫలమైన రేవంత్‌రెడ్డి సర్కారును జనాలు ఛీదరించుకుంటున్నారు. కేసీఆర్‌తో పోల్చుకుంటూ అన్యాయమైపోయినమని ఆవేదన చెందుతున్నరు. అది జీర్ణించుకోలేక కేసీఆర్ వంటి నాయకుడిపై చిల్లరమల్లర మాట్లాడి చిన్నగ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. **- దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే, బెల్లంపల్లి.**

### రాష్ట్రం పరువు తీస్తున్నారు..



రేవంత్‌రెడ్డి దిగుజారుడు మాటలు మాట్లాడుతూ రాష్ట్రం పరువు తీస్తున్నాడు. సీఎం హోదాను మరిచి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నరు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రేవంత్ మాదిరిగా మాట్లాడిన సందర్భాలు లేవు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి కుర్చీకి గౌరవం వచ్చేలా వ్యవహరించాలి. కానీ.. ఆయన మాట్లాడిన తీరును ప్రజలు, మేధావులు గమనిస్తున్నారు. కేసీఆర్ గురించి ఇష్టానుసారంగా మాట్లాడడం ఆయన దొంగబుద్ధికి నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో అసెంబ్లీ, మూసీ నది విషయంలో కూడా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి మరోసారి నోరు పారేసుకోవడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. **- జోగు రామన్న, మాజీ మంత్రి**



### దేశానికి గాంధీ ఎలాగో.. తెలంగాణకు కేసీఆర్ అలాగే..


ఏ నాయకుడైనా కానివ్వండి ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా, ఎంత వ్యతిరేకత ఉన్నా ఆసుపత్రికి పోవాలి, మార్చురీకి పోవాలని మాట్లాడడం సరికాదు. సంస్కారం ఉన్న ఏ వ్యక్తి అలా మాట్లాడరు. భారతదేశానికి గాంధీ ఎలానో, కేసీఆర్ తెలంగాణకు అలాగే. అలాంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి సంస్కారం లేని వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సీఎం అనుచిత వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నా. తక్షణమే కేసీఆర్‌కు, తెలంగాణ సమాజానికి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి. **- దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల**

# రేవంత్.. ఖబడ్దార్..

## సీఎం అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న తెలంగాణ

- కేసీఆర్ అంటే రేవంత్‌కు భయమెందుకు?
- మొన్నటి దాక అసెంబ్లీకి రావాలంటూ పట్టు
- ప్రభుత్వాన్ని చీల్చిచెండాడుతామంటూ కేసీఆర్ ప్రకటన
- సమావేశానికి హాజరైన రోజే అంతర్మథనంలో సర్కార్
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి అసందర్భ ప్రేలాపనలు
- పార్టీలకు అతీతంగా కేసీఆర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తున్న నాయకులు, మేధావులు


మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్/నిర్మల్, మార్చి13(నమస్తే తెలంగాణ) : తెలంగాణ అంటే గుర్తుకొచ్చే పేరు కేసీఆర్.. ప్రత్యేక తెలంగాణ వాదాన్ని నిలబెట్టి, చావు నోట్లో తలబెట్టి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన యోధుడు. యావత్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే నేత. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఏ ఊరుకెళ్లినా మా దగ్గర ఎమ్మెల్యే ఎవ్వరైనా పర్లేదు, కానీ.. తెలంగాణకు కేసీఆర్ సారే ముఖ్యమంత్రిగా ఉండాలని చెప్పని మనిషే లేడు. అది కేసీఆర్‌పై తెలంగాణ జనాలకు ఉన్న అభిమానం. పదేండ్ల స్వరాష్ట్ర పాలనలో 60 ఏండ్ల సమైఖ్య పాలన గాయాలను మానేలా చేసిన ధీరుడు. రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఆయన పాలనలో సుభిక్షంగా బతికారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే తెలంగాణ అల్లకల్లోమైంది. రైతులు ఆగమైతున్నరు. మహిళలు, వృద్ధుల సంక్షేమం గాడితప్పింది. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలు చనిపోతున్నరు. సమస్యల వలయంలో చిక్కుకుని ఉద్యోగులు విలవిలలాడుతున్నరు. ఇక ఈ సర్కార్‌కు ఇచ్చిన గడుపు చాలు చీల్చి చెండాడుదామంటూ కేసీఆర్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. సర్కారును నిలదీయాలంటూ పిలుపునిచ్చారు. మొన్నటి దాక అసెంబ్లీ ఎందుకు రావడం లేదంటూ ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ అసెంబ్లీకి రావడంతో ఏం చేయాలో తెలియని అంతర్మథనంలో పడిపోయాడు. పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఏం చేయాలో తెలియక కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిండు. నోరుంది కదా అని ఇష్టం వచ్చినట్లు పారేసుకున్నడు. స్ట్రేచర్.. స్ట్రెచ్చర్.. మార్చురీకి పోవాలంటూ కేసీఆర్‌పై అక్కసును వెల్లగక్కిండు. పరిపాలన చేత కాక.. చావుభాష మాట్లాడిండు. కేసీఆర్ అంటే ఉన్న భయంతో ఆయనతో నేరుగా కొట్లాడలేక అవాకులు.. చవాకులు మాట్లాడిండు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది. ఇవేం మాటలు రేవంత్ అంటూ మండిపడుతున్నది. పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, మేధావులు కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు.



### ప్రజలు తరిమే రోజులు దగ్గరపడ్డాయ్..

కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన అసభ్యకరమైన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నా. కేసీఆర్ ఇక మార్చురీకి పోతాడేమో అంటూ నీచంగా మాట్లాడడం అత్యంత దారుణం. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన గొప్ప మనిషిగా కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. అలాంటి నేతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి భేషరతుగా క్షమాపణలు చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఎక్కడ సమావేశాలు పెట్టినా.. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషించడం అలవాటైపోయింది. పాలన చేతకాక నోటికొచ్చిన మాటలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రేవంత్‌రెడ్డిని ప్రజలు తన్ని తరిమేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. **- కే.రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త**

### సంస్కారహీనంగా మాట్లాడుతున్నడు..



కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయి. బాధ్యత గల పదవిలో ఉండి సంస్కార హీనంగా మాట్లాడుతున్నడు. కేసీఆర్ చావును కోరుకుంటూ.. కించపరిచేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డిని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. రాజకీయాల్లో ఎన్నికలప్పుడే విమర్శలు చేసుకోవడం చూశాం. కానీ.. ఈ సీఎం వచ్చి 15 నెలలు అవుతున్నా పాలించడం చేతకాక కేవలం విమర్శలు, వ్యక్తిగత దూషణలకే పరిమితమవుతున్నడు. కేసీఆర్‌ను కించపరిచేలా మాట్లాడడం సిగ్గుచేటు. వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి. కేసీఆర్, ఆయన కుటుంబంపై మరోసారి ఇలాంటి దూషణలకు దిగితే చూస్తూ ఊరుకోం. **- లోలం శ్యాంసుందర్, బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త**



### ఛీదరించుకుంటున్నరు..

రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరచి మాట్లాడుతున్నడు. కాంగ్రెస్ పాలనపై, రేవంత్ తీరుపై ప్రజలు ఛీదరించుకున్నా పద్ధతి మార్చుకోవడం లేదు. పరిపాలన చేతకాక, ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగుతున్నడు. ఇలాంటి వ్యక్తికి రాష్ట్రాన్ని అప్పగించి తప్పు చేశామని ప్రజలు ఇప్పటికే తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కేసీఆర్‌పై సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మరణాన్ని కోరుకుంటూ మార్చురీ వంటి పదాలు వాడడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. రేవంత్ వ్యాఖ్యలతో సభ్య సమాజం తలదించుకునే పరిస్థితి వచ్చింది. ఇలాంటి దూషణలతో రాబోయే తరానికి ఎలాంటి సందేశం ఇస్తున్నాడో అర్థం అవుతున్నది. ఇప్పటికైనా తప్పు తెలుసుకుని వెంటనే కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి. లేకుంటే రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదు. **- భూక్యా జాన్సన్ నాయక్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ సమన్వయకర్త**



ఆదిలాబాద్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మహిళలకు తినిపిస్తున్న జాగృతి అధ్యక్షుడు శ్రీనివాస్

## ఘనంగా కవితక్క పుట్టిన రోజు వేడుకలు

ఎదులాపురం/సోన్, మార్చి 13 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లో గల తెలంగాణ భవన్‌లో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు చారి, సీనియర్ నాయకులు సుభాష్‌రావు, మహ్మద్ నాహీమొద్దీన్, మసూద్ ఖాన్, అబ్దుల్ అజీజ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్‌రావు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్‌లోని సత్యసాయి అన్నదాన సత్రంలో సత్యసాయి బాబా చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రోగి సహాయకులకు అన్నదానం చేశారు. జాగృతి, బీఆర్ఎస్ మహిళ నాయకురాళ్లు శివకుమార్, ప్రమోద్, కస్తాల ప్రేమల, స్వరూపరాణి, మమత పాల్గొన్నారు.



సోన్ : మిఠాయిలు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

# శనగ రాశులు

- మార్కెట్లకు భారీగా తీసుకొచ్చిన రైతులు
- 85 వేల క్వింటాళ్ల సేకరణే మార్క్‌ఫెడ్ లక్ష్యం
- పది కేంద్రాల్లో కొనుగోలుకు చర్యలు



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో విక్రయానికి వచ్చిన శనగ పంట

ఆదిలాబాద్, మార్చి 13(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో శనగల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. యాసంగిలో రైతులు 60 వేల ఎకరాల్లో శనగ సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు సహకరించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. జిల్లాలోని పది మార్కెట్ యార్డుల్లో పంటను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో కందుల కొనుగోళ్లు చివరి దశకు చేరుకోగా.. మార్క్‌ఫెడ్ అధికారులు శనగ కొనుగోళ్లను ప్రారంభించారు. ఇప్పటికే మూడు కేంద్రాలు ఆదిలాబాద్, జైనథ్, ఇచ్చోడ మార్కెట్ యార్డుల్లో పంటను సేకరిస్తున్నారు. నాలుగు రోజుల కిందట కొనుగోళ్లు ప్రారంభం కాగా.. మూడు మార్కెట్ యార్డుల్లో 3500 క్వింటాళ్లను సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే దిగుబడులు రాగా.. రైతులు భారీ సంఖ్యలో శనగలను అమ్మడానికి మార్కెట్ యార్డుకు తీసుకొస్తున్నారు.

### 85 వేల క్వింటాళ్ల లక్ష్యం

ఆదిలాబాద్ జిల్లాలో యాసంగిలో మార్క్‌ఫెడ్ ద్వారా 85 వేల క్వింటాళ్ల పంటను సేకరించనున్నారు. క్వింటాలుకు ప్రభుత్వం రూ.5,650 మద్దతు ధర ప్రకటించింది. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.5,200 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటులో ధర తక్కువగా ఉండడంతో ప్రభుత్వ కేంద్రాలకు పంటను విక్రయించడానికి తీసుకొస్తున్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో పంటల తేమ, నాణ్యతను పరిశీలించి ప్రభుత్వం సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్లు జరుపుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో పంటను రైతులు భారీగా తీసుకొచ్చారు.

### పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం..



యాసంగిలో రైతులు సాగు చేసిన శనిగల కొనుగోళ్లను మార్క్‌పెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నాం. క్వింటాలుకు రూ.5,650 చొప్పున మార్కెట్ యార్డుల్లో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా సేకరిస్తున్నాం. రైతులు నాణ్యమైన పంటను తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి. రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో పరిశీలించిన తర్వాత పంటను తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా పది మార్కెట్ యార్డుల్లో రైతుల వద్ద ఉన్న మొత్తం పంటను తీసుకుంటాం. ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయించకుండా మార్కెట్ యార్డుల్లో అమ్మి మద్దతు ధర పొందాలి. **- ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజర్, ఆదిలాబాద్**



ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎమ్మెల్యే

బోథ్, మార్చి 13 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ హాలులో శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు జరిపిన జన్మదిన వేడుకల్లో పాల్గొని పుష్పగుచ్ఛం అందజేశారు.